మణిపూర్‌లో ఉద్రిక్తతలు తీవ్రం

- కర్ఫ్యూను లెక్కచేయకుండా ఆందోళనకారుల నిరసనలు
- ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు
- పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి!
- అదనపు బలగాలు పంపుతున్న కేంద్రం

నింగ్తౌఖాంగ్‌లో నిరసనకారులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన బీజేపీ మంత్రి గోవింద్ దాస్ ఇల్లు

ఇంఫాల్, నవంబర్ 18: మణిపూర్‌లో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. జిరిబామ్‌లో తమ వర్గానికి చెందిన ఆరుగురి హత్యను నిరసిస్తూ మైతీలు చేస్తున్న ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. కర్ఫ్యూ ఉత్తర్వులను లెక్కచేయకుండా నిరసనకారులు రోడ్ల మీదకు వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి జిరిబామ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుపరా ప్రాంతంలో ఆస్తులు ధ్వంసం చేస్తున్న నిరసనకారులతో పోలీసులకు ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో అతౌబా అనే ఓ యువకుడు మరణించాడు. పోలీసు కాల్పుల్లోనే అతడు మరణించాడని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు. అతడు కాల్పుల్లోనే మరణించాడని, అయితే ఎవరు కాల్పులు జరిపారనేది తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

కర్ఫ్యూ నిబంధనలు బేఖాతరు

కర్ఫూ ఉన్నప్పటికీ సోమవారం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కోఆర్డినేటింగ్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ(కోకోమి) నేతృత్వంలో మైతీలు సోమవారం నిరసనలు కొనసాగించారు. లంపేల్‌ఫాట్‌లోని ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం సహా అనేక ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేశారు. మణిపూర్ పరిణామాలపై వరుసగా రెండో రోజు సోమవారం కేంద్ర హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో మణిపూర్‌లో పరిస్థితులను సమీక్షించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపు చేయడానికి 5,000 మందితో కూడిన 50 కేంద్ర సాయుధ పోలీసు బలగాలను(సీఏపీఎఫ్)ను పంపించాలని కేంద్రం నిర్ణయించింది. కాగా, సీఆర్పీఎఫ్ కాల్పుల్లో మరణించిన 10 మంది కుకీ మిలిటెంట్లకు నివాళిగా మంగళవారం చురచాంద్‌పూర్‌లో కాఫిన్(శవపేటిక) ర్యాలీ నిర్వహించనున్నట్టు కుకీ సంఘాలు ప్రకటించాయి.

ఎన్డీయే సమావేశం

మణిపూర్‌లోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) మద్దతు ఉపసంహరించుకుంది. మణిపూర్‌లో సంక్షోభాన్ని పరిష్కరించి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఎన్‌పీపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఎన్‌డీఏ సమావేశాన్ని నిర్వహించారు. కాగా, ఏడుగురు ఎమ్మెల్యేలు కలిగిన ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరించుకున్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం కొనసాగనున్నది. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం ఆ పార్టీకి ఉంది.

బీజేపీ నేతల మూకుమ్మడి రాజీనామా

రాష్ట్రంలో అధికార బీజేపీ నేతల ఇండ్లపై ఆందోళనకారులు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో కమలం పార్టీ నేతలు భయాందోళన చెందుతున్నారు. జిరిబామ్ జిల్లాలో పలువురు బీజేపీ ఆఫీస్ బేరర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామా సమర్పించారు. రాష్ట్రంలో అత్యంత ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని వాళ్లంతా బీజేపీ అధిష్ఠానానికి రాసిన రాజీనామా లేఖలో గోడు వెళ్లబోసుకున్నారు.

డిసెంబర్ 6న ఢిల్లీ మార్చ్

రైతు సంఘాల ప్రకటన

చండీగఢ్: కేంద్రంలోని బీజేపీ సర్కారుపై అన్నదాతలు మళ్లీ సమరశంఖం పూరించారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించడం సహా తమ డిమాండ్లను కేంద్రం పట్టించుకోకపోవడంపై కన్నెర్ర చేశారు. కేంద్రం మీద ఒత్తిడి తెచ్చేందుకు డిసెంబర్ 6న 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా సోమవారం ప్రకటించాయి. గతంలో ఢిల్లీ చలో మార్చ్‌ను భద్రతా దళాలు అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13 నుంచి రైతు సంఘాలు శంభు, ఖనౌరీ సరిహద్దు వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్నాయి. 'మాకు ఇంకో మార్గం లేదు. మేం తొమ్మిది నెలల పాటు శాంతియుతంగా ప్రభుత్వ స్పందన కోసం వేచి చూశాం. కానీ ఇప్పుడు ఢిల్లీ దిశగా వెళతాం' అని కేఎంఎం నాయకుడు సర్వణ్ సింగ్ పంధేర్ తెలిపారు. ఎస్కేఎం నేత గురమ్‌నీత్ సింగ్ మంగత్ మాట్లాడుతూ రైతులు మార్చ్ చేయాలనుకుంటున్న రోడ్డులో భారీగా బారికేడ్లు ఉంచారని తెలిపారు. ఈ నెల 26 తర్వాత పంజాబ్ బీజేపీ నేతలకు నల్ల జెండాలు చూపిస్తామని రైతు నాయకులు చెప్పారు.

అమెరికా ప్రభుత్వ ఉద్యోగాల్లో భారీ కోతలు!

వాషింగ్టన్, నవంబర్ 18:: అమెరికా ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించబోతున్నట్లు ఇండియన్-అమెరికన్ వివేక్ రామస్వామి గురువారం సంకేతాలు ఇచ్చారు. ఇటీవల జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డీఓజీఈ)ని ఏర్పాటు చేశారు. దీనికి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలను నామినేట్ చేశారు. ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం మర్-ఏ-లగోలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో వివేక్ మాట్లాడారు. వాషింగ్టన్ డీసీ బ్యూరోక్రసీలోని ఎన్నికవని ఫెడరల్ బ్యూరోక్రాట్లలో చాలా మందిని తాను, ఎలాన్ మస్క్ పంపించేస్తామన్నారు. అత్యుత్తములకు ఉద్యోగాలు వస్తాయని, వారి రంగుతో సంబంధం ఉండదని చెప్పారు.





ఆకాశంలో అద్భుత నగరం!

- 250 ఏండ్లు ఉండేలా నిర్మాణం
- వ్యవసాయం, ఉద్యోగం అంతా అక్కడే
- సూచనలు కోరిన శాస్త్రవేత్తలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): హాలీవుడ్ సినిమా '2012' చూశారా? భూకంపంలో భూమి మొత్తం నాశనమైతే, హీరో కుటుంబం సహా పలువురు స్పేస్‌షిప్స్‌లలో తలదాచుకొంటారు. ప్రకృతి విపత్తుల కారణంగా భూమిమీద నివసిస్తున్న జీవరాశులు నశిస్తాయన్నది చరిత్ర చెప్తున్న సత్యం. డైనోసార్లే దీనికి పెద్ద ఉదాహరణ. మానవ చర్యల వల్ల పర్యావరణంలో జరుగుతున్న పెను మార్పులు ప్రకృతి ప్రకోపానికి బాటలు వేస్తున్నాయి. దీంతో భూమిలాంటి మరో గ్రహాన్వేషణ అనివార్యంగా మారింది. ఈ క్రమంలోనే తెరమీదకు వచ్చింది.. 'ప్రాజెక్టు హైపేరియన్'.

ఏమిటీ ప్రాజెక్టు?

రోదసిలో నిర్మించే నగరాన్నే 'ప్రాజెక్టు హైపేరియన్' లేదా 'ప్రాజెక్టు టైటాన్'గా పిలుస్తున్నారు. భూమి మీద ఓ టౌన్‌లో ఉండే అన్ని రకాల సదుపాయాలు, వసతులు ఆకాశంలో ఓ స్పేస్‌షిప్‌లో ఉండే ఈ నగరంలోనూ ఉంటాయి. భూమి మీద వ్యవసాయం చేసినట్టే అక్కడా సాగు చేయొచ్చు. ఉద్యోగం, పిల్లల చదువులు, సినిమాలు-షికార్లు, రోగాలొస్తే దవాఖానలు, జంతువులు, చెట్ల పెంపకం ఇలా ఒక్కటేమిటీ అన్నిరకాల సదుపాయాలు ఆ నగరంలో అందుబాటులో ఉంటాయి. కనీసం 250 ఏండ్లపాటు మనుగడ సాగించేలా ఈ నగరాన్ని నిర్మించనున్నట్టు 'ప్రాజెక్టు హైపేరియన్' శాస్త్రవేత్తల బృందం పేర్కొంది.

ఎందుకు ఈ ప్రాజెక్టు?

ప్రకృతి విపత్తులు, ప్రళయం, బయోవార్, కరోనా వంటి వైరస్‌ల వ్యాప్తి, అణుయుద్ధాలు వంటివి సంభవించినప్పుడు భూమి మీద జీవజాలం అంతరించిపోకుండా ఉండేందుకే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు.

సవాళ్లు లేకపోలేదు

స్పేస్‌షిప్ నడవడానికి ఇంధనం, నగరంలో గాలి, నీటి శుద్ధి, వాతావరణ పరిస్థితులను సమతుల్యం చేయడం, రోదసిలోని రేడియేషన్ ప్రజలపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వ్యర్థాల నిర్వహణ ఇలా పలు సవాళ్లు ఈ ప్రాజెక్టు ముందడుగులో అడ్డుపడుతున్నాయి. అయితే, త్వరలోనే వీటికి తగిన పరిష్కారం చూపిస్తామని, దీనికోసం అవసరమైన సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నట్టు 'ప్రాజెక్టు హైపేరియన్' శాస్త్రవేత్తల బృందం తెలిపింది. ఆసక్తి కలిగినవారు సవాళ్లకు పరిష్కారాలతో పాటు స్పేస్‌షిప్ డిజైన్‌లను జూన్ 2, 2025లోపు తమకు పంపించాలని విజ్ఞప్తి చేసింది.

'గ్లోబల్ సౌత్' దేశాల సవాళ్లపై దృష్టి పెట్టాలి

జీ-20 సదస్సులో ప్రధాని మోదీ

రియో డి జెనీరో (బ్రెజిల్), నవంబర్ 18: ప్రపంచంలో నేడు ఆయా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల కారణంగా 'గ్లోబల్ సౌత్' దేశాలు ఆహారం, ఇంధనం, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్నాయని భారత ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. 'గ్లోబల్ సౌత్' దేశాలు ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని పరిష్కరించటంపై జీ-20 దేశాల కూటమి దృష్టి సారించాల్సిన అవసరముందని ఆయన అన్నారు. సోమవారం బ్రెజిల్ రాజధాని రియో డి జెనీరో వేదికగా జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు అమెరికా, చైనా అధ్యక్షులు జో బైడెన్, జీ జిన్‌పింగ్, బ్రిటిన్ పీఎం స్టార్మర్ సహా ఆయా దేశాల నాయకులు హాజరయ్యారు.

పాకిస్థాన్ నౌకను వెంటాడి..!

భారతీయులను కాపాడిన కోస్ట్‌గార్డ్

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మారిటైమ్ సరిహద్దు వద్ద పాకిస్థాన్ నౌక నుస్రత్ సిబ్బంది తీసుకెళ్లిపోతున్న ఏడుగురు భారతీయ మత్స్యకారులను ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) సాహసోపేతంగా కాపాడింది. ఐసీజీ తెలిపిన వివరాల ప్రకారం, ఇండియన్ కోస్ట్ గార్డ్ నౌక అగ్రిమ్ ఆదివారం గస్తీ తిరుగుతున్నది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో నో ఫిషింగ్ జోన్ సమీపంలో ఓ భారతీయ చేపల పడవ నుంచి డిస్ట్రెస్ కాల్ వచ్చింది. పాకిస్థానీ నౌక నుస్రత్ భారతీయ చేపల పడవ కాల భైరవ్‌ను స్వాధీనం చేసుకుని, దానిలోని ఏడుగురు మత్స్యకారులను తీసుకెళ్లిపోతున్నట్లు ఆ కాలర్ చెప్పారు. దీంతో పాకిస్థానీ నౌకను అగ్రిమ్ నౌక వెంటాడి, అడ్డుకుని, దానిలోని భారతీయులందరినీ విడిపించింది. అయితే, కాల భైరవ్ దెబ్బతిని, మునిగిపోయింది. అగ్రిమ్ నౌక సోమవారం తిరిగి ఓఖా హార్బర్‌కు వచ్చింది.

ఢిల్లీలో 'ఎయిర్ ఎమర్జెన్సీ'.. బడులు బంద్

- కాలుష్యంతో రాజధాని ఉక్కిరిబిక్కిరి
- పలు విమానాల దారి మళ్లింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం చుట్టేసింది. ఇండ్లు, కార్యాలయాల లోపల కూడా పొగ అలుముకున్నది. దీంతో ఢిల్లీవాసులకు ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారింది. కళ్లు పొడిబారడం, మంట వంటి సమస్యలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కాలుష్యం తీవ్రతకు వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాలుష్యం కారణంగా 14 విమానాలను దారి మళ్లించారు. పాఠశాలలు మూసివేసి, ఆన్‌లైన్ తరగతులు చెప్తున్నారు. ఇంత తీవ్రమైన కాలుష్యాన్ని గతంలో ఎన్నడూ చూడలేదని ఢిల్లీ ప్రజలు చెప్తున్నారు. ఊపిరి తీసుకుంటున్నామో, పొగ తాగుతున్నామో అర్థం కానంతగా కాలుష్యం పెరిగిపోయిందని వాపోతున్నారు. మాస్కులు లేనిది ప్రజలు రోడ్డు మీదకు రావడం లేదు.

కొలమానాలకు అందనంత కాలుష్యం

నగరంలో సోమవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) 494గా రికార్డు అయ్యింది. గత ఆరేండ్లలో ఇది రెండో అత్యధికం. అయితే, సీపీసీబీ లెక్కల కంటే చాలా ప్రమాదకరంగా కాలుష్యం ఉన్నట్టు స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూఎయిర్ సంస్థ పేర్కొన్నది.

విమానాలు దారి మళ్లింపు

పొగ కాలుష్యం కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. రన్‌వే సరిగ్గా కనిపించకపోవడంతో ఢిల్లీలో ల్యాండ్ అవ్వాల్సిన 14 విమానాలను జైపూర్, డెహ్రాడూన్‌కు మళ్లించారు. కాలుష్యం నేపథ్యంలో అన్ని తరగతులకూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

49 సిగరెట్లు తాగడంతో సమానం

ఢిల్లీలో 494 ఏక్యూఐ నమోదైందనే వార్తలపై స్పందించిన నిపుణులు.. ఇంత కాలుష్యంలో ఊపిరి తీసుకోవడం అంటే రోజూ 49 సిగరెట్లు కాల్చటంతో సమానమని తెలిపారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారే కాకుండా ఆరోగ్యంగా ఉన్న వారు సైతం ఈ స్థాయి కాలుష్యానికి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, శ్వాసకోశ సంబంధ సమస్యలకు గురి కావొచ్చని హెచ్చరించారు. ఎన్-95 మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.

ఓట్ల బదిలీ జరిగేనా?

- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి ఇదే కీలకం
- శివసేన, ఎన్సీపీ ఓటుబ్యాంకు ఏ కూటమి వైపు మళ్లుతుందో?
- చిన్న పార్టీల ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో?
- రెండు కూటముల్లోనూ పెరుగుతున్న ఆందోళన
- ముగిసిన ప్రచారపర్వం

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం ముగిసింది. బుధవారం రాష్ట్రంలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆర్థిక రాజధానిలో అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు మహాయుతి, మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) తీవ్రంగా శ్రమిస్తున్నాయి. రాష్ట్రమంతా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మహారాష్ట్ర ఎన్నికలు ఆరు పార్టీలతో కూడిన రెండు ప్రధాన కూటముల మధ్య హోరాహోరీ జరుగుతున్నాయి. దీంతో పార్టీల మధ్య పొత్తులు ఫలిస్తాయా? ఓట్లు బదిలీ అవుతాయా? అనే అంశాలపై ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉండనున్నాయి. పార్టీలు సైతం ఓట్ల బదిలీ పూర్తిస్థాయి లో జరిగేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

అంతుచిక్కని ఓటర్ల మనోగతం

ఈ ఎన్నికలు శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) భవిష్యత్తుకు కీలకంగా మారాయి. దశాబ్దాలుగా ఈ రెండు పార్టీలకు మహారాష్ట్రలో బలమైన ఓటుబ్యాంకు ఉంది. ఈసారి ఈ రెండు పార్టీల్లో చీలిక ఏర్పడటంతో ఓటర్లు ఎటువైపు ఉంటారనేది ఎవరికీ అంతు చిక్కడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్, ఎన్సీపీ ఒక కూటమిగా, బీజేపీ, శివసేన మరో కూటమిగా అనేక ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయి. ఆయా పార్టీల మధ్య ఓట్ల బదిలీ సులువే. అయితే, ఎంవీఏలో భాగంగా ఉన్న శివసేన(ఉద్ధవ్)కు ఉండే హిందూత్వ ఓటు బ్యాంకు కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)కి బదిలీ అవుతుందా? మైనారిటీ, దళిత ఓట్లు ఎక్కువగా ఉండే కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ) ఓట్లు శివసేన(ఉద్ధవ్)కు పడతాయా? అనే అంశం ఎంవీఏ గెలుపోటములను ప్రభావితం చేయనుంది. ఈ స్థాయిలో కాకపోయినా మహాయుతిలో ఎన్సీపీ(అజిత్) విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రెండు కూటముల్లో క్రాస్ ఓటింగ్ భయాలు పెరుగుతున్నాయి.

చిన్న పార్టీల ప్రభావమెంత?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న పార్టీలు ఏమేరకు ప్రభావం చూపగలవు? ఎవరి విజయావకాశాలను దెబ్బతీయగలవు? అనే లెక్కలూ కీలకంగా మారాయి. దాదాపు 15 చిన్న పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) 239 సీట్లలో పోటీ చేస్తున్నది. 25 సీట్లపై ప్రధానంగా దృష్టి సారించామని, 6 శాతం ఓట్లు సాధించడమే లక్ష్యమని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడీ(వీబీఏ) ఆజాద్ సమాజ్ పార్టీ 40 స్థానాల్లో, ఎంఐఎం 16 స్థానాల్లో, హితేంద్ర ఠాకూర్ నేతృత్వంలోని బహుజన్ వికాస్ అఘాడీ ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. మరో ఎనిమిది చిన్న పార్టీలు పరివర్తన్ మహా శక్తి కూటమిగా ఏర్పడి 111 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఈ పార్టీలు ప్రధానంగా ఎంవీఏ ఓట్లకు గండి కొట్టే అవకాశాలు ఉన్నాయి. 135 స్థానాల్లో బరిలో ఉన్న రాజ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాన్ సేన(ఎంఎన్ఎస్) ప్రభావం రెండు శివసేన పార్టీలపై పడొచ్చు. ఈ పార్టీల విజయావకాశాలను అటుంచితే మహాయుతి, ఎంవీఏ అభ్యర్థుల గెలుపోటములను మాత్రం ప్రభావితం చేసే అవకాశం ఉంది.

అమెరికాలో మనోళ్లే టాప్

- అంతర్జాతీయ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే
- 2023-24లో 3.31 లక్షల మంది విద్యార్థుల విద్యాభ్యాసం
- ఓపెన్ డోర్స్-2024 నివేదిక

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఉన్నత చదువుల కోసం అమెరికా బాట పడుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. 2023-24 విద్యా సంవత్సరంలో అమెరికాకు అంతర్జాతీయ విద్యార్థులను పంపిన దేశాల్లో భారత్ టాప్‌లో నిలిచింది. 3.31 లక్షల మంది విద్యార్థులతో భారత్ మొదటిస్థానంలో ఉండగా, చైనా రెండో స్థానానికి పరిమితమైందని 'ఓపెన్ డోర్స్' నివేదిక పేర్కొన్నది. 2023-24లో అమెరికా 11.26 లక్షల స్టూడెంట్ వీసాలు జారీచేసింది. నివేదిక ప్రకారం, 2022-23లో అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య 2,68,923 కాగా, 2023-24నాటికి 23 శాతం పెరిగి 3,31,602కు చేరుకుంది. ఇందులో మాస్టర్స్, పీహెచ్‌డీ చేస్తున్న వారు 1,96 లక్షల మంది ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. గతంలో వీరి సంఖ్య 1.65 లక్షలుగా ఉండేది. అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్ మొదటిస్థానంలో నిలబడటం 15 ఏండ్లలో ఇదే తొలిసారి. భారత్‌లో చదువుతున్న అమెరికా విద్యార్థుల సంఖ్య కూడా పెరిగినట్టు నివేదిక తెలిపింది. 2021-22లో 331 మంది అమెరికన్ విద్యార్థులు మన దగ్గర చదవగా, 2022-23లో వీరి సంఖ్య 1,355కు పెరిగింది.

ఆయా కోర్సుల్లో చేరిన భారత విద్యార్థులు

కోర్సు	2022-23	2023-24
అండర్ గ్రాడ్యుయేట్	31,954	36,053
గ్రాడ్యుయేట్	1,65,936	1,96,567
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్	69,062	97,556
డిగ్రీయేతర కోర్సులు	1,971	1,426
మొత్తం	2,68,923	3,31,602

20 వేల మందికి బిచ్చగాడి విందు!

లాహోర్: పాకిస్థాన్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉంది కానీ, అక్కడి బిచ్చగాళ్లు ఆస్తిపరులుల్లాగానే కనిపిస్తున్నారు. పంజాబ్ ప్రావిన్స్, గుజ్రాన్‌వాలాలో, రాహ్‌వలీ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బిచ్చగాడి కుటుంబం ఇచ్చిన విందు సంపన్నులను సైతం అవాక్కయ్యేలా చేసింది. బిచ్చగాడి నాన్నమ్మ మరణించడంతో, 40వ రోజున సుమారు 20 వేల మందిని ఆహ్వానించి, నోరూరించే అనేక రకాల ఆహార పదార్థాలను వడ్డించారు. దీని కోసం 1.25 కోట్ల పాకిస్థానీ రూపాయలు ఖర్చు చేశారు. అతిథులను తరలించడానికి సుమారు 2,000 వాహనాలను ఉపయోగించారు. ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

నేడు నింగిలోకి జీశాట్-20

చెన్నై, నవంబర్ 18: ఇస్రోకు చెందిన జీశాట్-20(జీశాట్-ఎన్2) ఉపగ్రహం ఈ నెల 18న యూఎస్ కాలమాన ప్రకారం సాయంత్రం 6.31 గంటలకు(భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి 12.01 నిమిషాలకు) స్పేస్ ఎక్స్ రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకెళ్లనుంది. ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ ఇందుకు వేదిక కానుందని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ వియాన్ వార్తా సంస్థకు వెల్లడించారు. బ్యాకప్ ప్రయోగ తేదీగా యూఎస్ కాలమాన ప్రకారం మంగళవారం ఉదయం 9.33 గంటలను ఎంపిక చేశారు. 4.7 టన్నుల బరువైన ఈ కమ్యూనికేషన్ ఉపగ్రహం అండమాన్ & నికోబార్, లక్షద్వీప్‌తో పాటు భారత్ మొత్తాన్ని కవర్ చేసి బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తుంది.

నూతన కాగ్ సంజయ్ మూర్తి

న్యూఢిల్లీ: తదుపరి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్)గా కే సంజయ్ మూర్తి నియమితులయ్యారు. ప్రస్తుత కాగ్ గిరీశ్ చంద్ర ముర్ము పదవీ కాలం ఈ నెల 20న ముగుస్తుంది. మూర్తి హిమాచల్ ప్రదేశ్ క్యాడర్ 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర విద్యా శాఖలో కార్యదర్శిగా ఉన్నారు. మూర్తిని తదుపరి కాగ్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఆయన పదవీ బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొన్నది.

వైద్యులపై దాడి కేసులకు కేంద్ర చట్టం అక్కర్లేదు

నేషనల్ టాస్క్‌ఫోర్స్ సిఫారసు

న్యూఢిల్లీ : వైద్య రంగంలో పని చేసేవారిపై జరిగే నేరాలపై దర్యాప్తు కోసం ప్రత్యేకంగా కేంద్ర చట్టం అక్కర్లేదని నేషనల్ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టీఎఫ్) చెప్పింది. స్వల్ప నేరాలపై విచారణ కోసం రాష్ట్రాల చట్టాలు సరిపోతాయని, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ద్వారా తీవ్రమైన నేరాలను పరిష్కరించవచ్చునని తెలిపింది. కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖానలో ఓ ట్రైనీ వైద్యురాలి హత్యాచారం నేపథ్యంలో సుప్రీం కోర్టు ఎన్‌టీఎఫ్‌ను ఏర్పాటు చేసింది. మెడికల్ ప్రొఫెషనల్స్ భద్రత కోసం నిబంధనలను రూపొందించాలని ఆదేశించింది. ఆగస్టు 20న ఏర్పాటైన ఎన్‌టీఎఫ్ పలు సిఫారసులు చేసింది. వైద్య రంగంలో పని చేసేవారిపై జరిగే హింసాత్మక సంఘటనలపై విచారణ కోసం 24 రాష్ట్రాల్లో ఇప్పటికే చట్టాలు ఉన్నాయని, వీటిలో 'హెల్త్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్', 'మెడికల్ ప్రొఫెషనల్స్' పదాలకు నిర్వచనాలు కూడా ఉన్నట్లు వివరించింది.

యుద్ధానికి సిద్ధంగా ఉండండి

పౌరులకు స్వీడన్, ఫిన్‌లాండ్ సూచన

స్టాక్‌హోమ్: యుద్ధం సంభవిస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తమ దేశాల పౌరులకు స్వీడన్, ఫిన్‌లాండ్ సూచిస్తున్నాయి. యుద్ధం, ప్రకృతి విపత్తులు, సైబర్ దాడి వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలో చెప్తూ ప్రజలకు 52 లక్షల బుక్‌లెట్లను స్వీడన్ పంపిణీ చేస్తున్నది. 32 పేజీలతో ఈ బుక్‌లెట్ ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇలాంటి బుక్‌లెట్లను స్వీడన్ ఐదుసార్లు ప్రజలకు పంపిణీ చేసింది. మరోవైపు ఫిన్‌లాండ్ కూడా సంక్షోభాలకు ప్రజలను సంసిద్ధం చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. స్వీడన్, ఫిన్‌లాండ్ అనేక దశాబ్దాలుగా సైనిక అలీన విధానాన్ని పాలిస్తూ వచ్చాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో నాటో కూటమిలో చేరేందుకు ఇటీవలే ఈ విధానాన్ని మార్చుకున్నాయి.

దీర్ఘశ్రేణి క్షిపణులకు సై

ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు బైడెన్ పచ్చజెండా

- రష్యాలోని సుదూర ప్రాంతాలపై దాడి చేసేందుకు అవకాశం
- రష్యా - ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధంలో కీలక పరిణామం
- మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని రష్యా హెచ్చరిక

కీవ్, నవంబర్ 18: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. యుద్ధంలో దీర్ఘశ్రేణి క్షిపణులను వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతించారు. దీంతో అమెరికా సరఫరా చేసిన ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్(ఏటీఏసీఎం)ను వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు అడ్డంకులు తొలిగిపోయాయి. చాలా రోజులుగా ఈ క్షిపణులను వినియోగించేందుకు అనుమతివ్వాలని అమెరికాను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరుతున్నప్పటి అమెరికా మాత్రం అంగీకరించడం లేదు. కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలో ఇంతకుముందు ఉక్రెయిన్ స్వాధీనం చేసుకున్న తమ భూభాగాన్ని మళ్లీ దక్కించుకోవాలని రష్యా ప్రయత్నిస్తున్న వేళ బైడెన్ తన నిర్ణయాన్ని మార్చుకొని అంగీకరించారు